క్లుప్తంగా

పన్ను చెల్లించండి.. వడ్డీ రాయితీ పొందండి

తుని: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులను ఈ నెల 31 లోగా చెల్లిస్తే వడ్డీ రాయితీ పొందవచ్చునని కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలోని యాజమానులు ఇంటి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నుల మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు దంత పరీక్షలు



ఏలేశ్వరంలో దివ్యాంగులకు దంతపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

ఏలేశ్వరం: వరల్డ్ ఓరల్ హెల్త్ డే పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో దివ్యాంగ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. స్థానిక భవిత కేంద్రంలోని సుమారు 35 మంది విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి శైలజ దంత పరీక్షలు చేశారు. విద్యార్థులు దంతాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్లు వాణిపద్మజ, సరస్వతి, వైద్య సిబ్బంది దాకమర్రి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న కొండలరావు సెలవు పెట్టడంతో మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

21న మోత వెంకట్రావు వర్ధంతి సభ

గోకవరం: రాజమహేంద్రవరంలోని విక్రమ్ హాలులో ఈ నెల 21న నిర్వహించే ఏఐఎఫ్‌టీయూ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి మోత వెంకట్రావు వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాలు, పేద ప్రజల కోసం మోత వెంకట్రావు పని చేశారన్నారు. 21న నిర్వహించే ఆయన వర్ధంతి సభలో సంఘం నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీలాద్రిరాజు మృతికి సంతాపం

జగ్గంపేట: గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నేత మంతెన నీలాద్రిరాజు (62) శుక్రవారం మృతి చెందారు. ఇటీవల ఆయన మెదడు సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగా శుక్రవారం ఆరోగ్యం విషమించి కన్నుమూశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, జగ్గంపేటకు చెందిన పలు పార్టీల నేతలు నీలాద్రిరాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఏలేశ్వరం పోలీసులపై చర్యలు తీసుకోండి

కాకినాడ సిటీ: కిడ్నాప్ కేసును తప్పుదోవ పట్టిస్తున్న ఏలేశ్వరం పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ మండలం రమణయ్యపేటకు చెందిన సాంబత్తుల లక్ష్మి శుక్రవారం జేసీని కలసి కోరారు. తన బాలికను అదే గ్రామానికి చెందిన కాతేటి రవి, అతని స్నేహితులు చేట్ల అప్పలరాజు, సిలికోటి చంద్రరావు, మిరియాల రాముడు తదితరులు ఈనెల 11వ తేదీ రాత్రి కిడ్నాప్ చేసి తీసుకెళ్లిపోయారని వివరించారు. ఆ సమయంలో తన కుమార్తె చర్చికి వెళ్తోందన్నారు. ఈ విషయం జరిగిన వెంటనే గ్రామ పెద్దల సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామన్నారు. ఏలేశ్వరం పోలీసులు కిడ్నాప్ కేసుగా నమోదు చేయకుండా కేసును తప్పుద్రోవ పట్టించి మిస్సింగ్ కేసుగా నమోదు చేశారన్నారు. ఈ సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా తమ బిడ్డ ఆచూకీ లభ్యం కాలేదని జేసీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి జైభీమ్‌పార్టీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగుపల్లి కృష్ణ సంఘీభావం తెలిపి ఏలేశ్వరం పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కంపోస్ట్.. ఆదాయం బెస్ట్

- వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ
- తునిలో 10 సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు
- తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన
- మున్సిపాలిటీకి అదనపు ఆదాయం



తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతుకు విక్రయిస్తున్న దృశ్యం

తుని: పట్టణంలోని పనికిరాని వ్యర్థాలతో సంపదను సృష్టిస్తున్నారు. తడి చెత్త నుంచి వచ్చిన కంపోస్టు ఎరువును రైతులకు విక్రయిస్తున్నారు. తద్వారా పురపాలక సంఘానికి అదనపు ఆదాయం వస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు.

ప్రజలకు అవగాహన కల్పించి...

పట్టణంలోని ప్రజలకు తొలుత తడి, పొడి చెత్తల సేకరణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దీంతో ప్రజలు వ్యర్థాలను రహదారులపై వేయడం లేదు. మహిళలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేస్తున్నారు. ప్రస్తుతం 10 కేంద్రాల్లో కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను తడి, పొడి చెత్తగా విభజించి ఎంఆర్‌ఎఫ్ సెంటర్‌కు తరలిస్తున్నారు. ఇలా నిల్వ చేసిన పొడి చెత్తను రోడ్లు, భవనాలశాఖకు ఇచ్చేందుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. తుని బ్యాంక్ కాలనీతో పాటు మరో తొమ్మిది చోట్ల సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో డంపింగ్ యార్డుకు తరలించే వ్యర్థాలు పరిమాణం తగ్గిందని అధికారులు చెబుతున్నారు.



తునిలో తడి చెత్త నుంచి తయారు చేసిన కంపోస్టు ఎరువు



దాతల సహకారంతో ఏర్పాటు చేసిన బాక్సులో తడి చెత్తను వేస్తున్న పారిశుధ్య కార్మికుడు

10 కేంద్రాల్లో సంపద సృష్టి

తడి, పొడి చెత్త సేకరణ కోసం పట్టణంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు దాతల సహకారంతో 30 వార్డుల్లో బాక్సులు ఏర్పాటు చేశారు. పది ప్రాంతాల్లోనూ తడి చెత్త పరిమాణం ప్రకారం ట్రెంచ్‌లు(గోతులు) ఏర్పాటు చేశారు. 11 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పుతో ట్రెంచ్‌ను ఏర్పాటు చేశారు. గ్రేడింగ్ చేయగా వచ్చిన తడి చెత్తను వీటిలో వేస్తున్నారు. రోజుకు 5 టన్నుల తడి చెత్త వస్తోంది. తడి చెత్త కంపోస్ట్ చేసిన తర్వాత ఎరువుగా మారడానికి 40 నుంచి 60 రోజులు పడుతుంది. టన్ను తడి చెత్త నుంచి 25 కిలోలు కంపోస్టు ఎరువు వస్తోంది. కిలో రూ.3 చొప్పున రైతులకు విక్రయిస్తున్నారు. సేంద్రియ ఎరువు కావడంతో ఎక్కువ మంది రైతులు అధికారులను సంప్రదిస్తున్నారు. పురపాలక సంఘానికి రెండు విధాలుగా ప్రయోజనం చేకూరుతోంది.

సచివాలయ కార్యదర్శులకు పర్యవేక్షణ బాధ్యతలు

పట్టణంలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను సచివాలయ కార్యదర్శులకు అప్పగించారు. శానిటేషన్ నుంచి ఇద్దరు, వలంటీర్లు, కార్యదర్శి చెత్త సేకరణ, వేరు చేయుట పనులను చూస్తారు. వార్డుల్లో గృహిణులకు వలంటీర్లు తడి,పొడి చెత్త వేరు చేయుటపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజల సహకారంతోనే..



తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించేందుకు ప్రజలు సహకరిస్తున్నారు. పట్టణంలో 10 సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. సిబ్బందితో పాటు వలంటీర్ల పర్యవేక్షణలో సంపద సృష్టి బాగానే జరుగుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సూచనల మేరకు కేంద్రాల సంఖ్యను పెంచడంతో పాటు సెంద్రియ ఎరువును రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. భవిష్యత్‌లో మున్సిపాలిటీకి భారీగా అదనపు ఆదాయం సమకూరనుంది.
– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, తుని

నేడు అరుణాచల క్షేత్రానికి కంచికామకోటి పీఠాధిపతి



కంచికామకోటి పిఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి క్షేత్రాన్ని శనివారం కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ సందర్శించనున్నట్లు శ్రీరమణా సేవా ఆశ్రమం పీఠాధిపతి రమానంద స్వామీజీ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ విజయేంద్ర సరస్వతీ అరుణాచలక్షేత్రంలో పర్యటిస్తారని చెప్పారు.

రేపు బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

కోటనందూరు: తొండంగి మండలం రావికంపాడులో ఈ నెల 19న జరిగే బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. మండలపరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. మాదిగ ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. మాదిగలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మోర్త అబ్బులు, మిరియాల ఆశీర్వాదం, మోర్త మాణిక్యం, ఏసుబాబు, మసురుపాము చెల్లారావు, ఆరుగుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు.

ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. వేద పండితులు హనుమంతువజ్ఝుల అవధాని, కంచిభట్ల రామ్‌కుమార్, దత్తాత్రేయ శర్మ, చిట్టెం వాసు, కొంపెల్ల సత్యనారాయణ మూర్తి, కూచుమంచి ప్రసాద్ హోమం జరిపారు. 15 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రామాల్లో డ్రైడే- ఫ్రైడే



బొద్దవరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం డ్రైడే- ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. నివాసాల మధ్య నిల్వ ఉన్న నీటిని తొలగించి జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఇందుగపల్లి, బొద్దవరం, టీజే నగరం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాన్ని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి పరిశీలించారు. మురుగు ప్రాంతాలు, డ్రైనేజీల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు.

ఉద్యాన పంటలకు నీటి ఎద్దడి



తుని మండలం చామవరంలో నీటి ఎద్దడితో ఎండుతున్న టమాటా పంట

- మెట్టలో ఎండిపోతున్న టమాటా పంట
- ఆందోళన చెందుతున్న రైతులు

తుని రూరల్: ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్‌లో నీటి ఎద్దడి కారణంగా టమాటా పంటలు ఎండిపోతున్నాయి. మెట్ట ప్రాంతం కావడం, ఫిబ్రవరి నుంచి వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో సాగునీటి చెరువుల్లో సైతం నీటి నిల్వలు పూర్తిగా ఆవిరైపోయాయి. దీంతో ఆరుతడిగా రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా టమాటా పంటలకు తడులు అందక ఎండిపోతున్నాయి. కాకినాడ జిల్లాలోని పది మండలాల్లో 373 ఎకరాల్లో 380 మంది రైతులు టమాటా సాగు చేస్తున్నారు. ఒక్క తుని సబ్‌డివిజన్‌లోనే తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోనే 139 మంది రైతులు వంద ఎకరాల్లో టమాటాలను పండిస్తున్నారు. మార్కెట్‌లో టమాటాలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుండగా నీటి ఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. దిగుబడులు సైతం తగ్గిపోయాయని చామవరం, తాళ్లూరు, కుమ్మరిలోవ, వి.కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు తెలిపారు. చిల్లర ధర కిలో రూ.30కి విక్రయిస్తుండగా రైతులకు గిట్టుబాటు ధర గరిష్ఠంగా రూ.12 చొప్పున లభిస్తుంది.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తొండంగి: మండలంలోని పీఈ చిన్నాయపాలెంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు గ్రామ యూత్ సభ్యులు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన హైమా నేత్రాలయం వైద్యులు రోగులకు కంటి పరీక్షలు చేస్తారన్నారు. పరీక్షలు చేయించుకునే వారు ఆధార్‌కార్డు జెరాక్స్‌తో హాజరు కావాలన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 50 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని శుక్రవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లిషు పరీక్షకు 50 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 504 విద్యార్థులకు గాను 479 మంది, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలలో 332 విద్యార్థులకు గాను 307 మంది పరీక్షలకు హాజరు కాగా 50 మంది గైర్హాజరైనట్టు డీఓ వర్ధనపు శివప్రసాద్ వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రత్తిపాడులో 18 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: స్థానిక హర్షవర్ధన జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో 408 మంది పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 390 మంది హాజరైనట్టు అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆనందకుమార్ జోషి తెలిపారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

తుని రూరల్: ఆటికెవానిపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం సీతారాములు, వినాయకుడు, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 8.49 గంటలకు శ్రీసీతారాముల విగ్రహాలను, 10.18 గంటలకు వినాయక, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు వివరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆర్‌ఎంపీ చిట్టికొండకు డాక్టరేట్



ఢిల్లీలో డాక్టరేట్ అందుకుంటున్న చిట్టికొండ

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) అందే సత్యనారాయణ (చిట్టికొండ) డాక్టరేట్ పొందారు. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సామాజిక సేవ, ఆరోగ్య సంరక్షణ సేవల విభాగంలో అందే చిట్టికొండకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ సీపీ యాదవ్, రిజిస్ట్రార్ సుష్మితాడే, బోనోరిస్ కాసా తదితరులు అందే చిట్టికొండకు డాక్టరేట్‌ను అందజేశారు. గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న అందే చిట్టికొండను గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సలాది కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం తదితరులు అభినందించారు.

హాస్టల్ విద్యార్థిని మృతి

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్ విద్యార్థిని పులిదిండి మణికుమారి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెన్ కారణమని, వారిని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, దళితసంఘాల ప్రతినిధులు శుక్రవారం రాత్రి హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. రామచంద్రపురం మండలం హసనబాదకు చెందిన మణికుమారికి ఈనెల 13న వాంతులు కావడంతో వార్డెన్ ట్యాబ్లెట్ ఇచ్చారు. పరీక్షలు రాస్తున్న ఆమెకు మరుసటి రోజూ వాంతులు కావడంతో వార్డెన్ జీజీహెచ్‌కు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి సమస్య ఏమీ లేదని వైద్యులు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పంపేశారు. కాగా ఆమె పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెనే కారణమని, ఆమెను, సోషల్ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. ఆందోళనకారులతో డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ కృష్ణ తదితరులు చర్చించారు.

ధర్మ సంస్థాపనకే దశావతారాలు



ఆధ్యాత్మిక ప్రవచనంలో పాల్గొన్న మహిళలు

ఏలేశ్వరం: ధర్మ సంస్థాపన కోసమే విష్ణుమూర్తి దశావతారాలు ఎత్తారని శ్రీమాన్ చినజీయర్‌స్వామి శిష్యురాలు వాగు రోహిణి అన్నారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విష్ణుమూర్తి దశావతారాలపై ఆమె ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అన్ని యుగాల్లోనూ ధర్మసంస్థాపన కోసమే విష్ణుమూర్తి పలు అవతారాలు ఎత్తారన్నారు. రామునిగా మానవజన్మ ఎత్తి ధర్మాన్ని కాపాడారని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిణి ఆధ్వర్యంలో పారాయణాలు పఠనం చేశారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు పాటోలు దేవి, మల్లేశ్వరి, కల్యాణి, ఇందిరాప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



మల్లేపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న సీఎంఓ నాగేశ్వరరావు

గండేపల్లి: మండలంలోని పలు పాఠశాలలతో పాటు మల్లేపల్లిలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం కాకినాడ సమగ్ర శిక్షా సీఎంఓ, జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చామంతి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలతో మాట్లాడి విద్యాప్రమాణాలు, ప్రగతిని అంచనా వేశారు. తొలుత గండేపల్లి, మల్లేపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులు, స్కూల్స్ రిజిస్టర్స్, క్లాస్ రూమ్స్‌లో విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం జి.సుధామాధురి, సీఆర్పీ తాతబాబు, ఐఈఆర్‌పీఎస్ లోవ, ప్రకాశరావు తదితరులు ఉన్నారు.

దేవస్థానం హైస్కూల్ పరిశీలన



విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ మనోహర్

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానం నిర్వహణలో గల సంస్కృతోన్నత పాఠశాలను అమరావతికి చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. దేవస్థానం అన్నదాన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శంఖవరం మండలంలోని పలు హైస్కూళ్లలో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో వ్యాయామ విద్యా బోధనపై ఆరా తీశారు. అనంతరం ఆయన రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆయనకు సత్యదేవుని ప్రసాదాలను దేవస్థానం హైస్కూల్ హెచ్‌ఎం అల్లాడ వేంకటేశ్వరరావు, పీఈటీ పర్వత వీరేష్ అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు నిరసన

గోకవరం: తన ఆధీనంలో ఉన్న భూమిని వేరే వ్యక్తుల రికార్డుల్లోకి ఎక్కించారంటూ రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన రైతు సత్యం గంగాధర్ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళితే.. రైతు గంగాధర్ వారి కుటుంబ సభ్యులకు చెందిన కొంత భూమిని కొద్ది సంవత్సరాల క్రితం వేరే వారికి అమ్మారు. అమ్మగా మిగిలిన భూమి వీరు ఆధీనంలో ఉన్నప్పటికీ రీసర్వేలో వేరే వారి పేరుపై వచ్చిందని ఆరోపిస్తూ నిరసన తెలిపాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన స్థానిక నాయకులు ఆయనతో చర్చలు జరపగా నిరసన విరమించాడు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా భూమి పత్రాల ఆధారంగానే రికార్డు మంజూరు చేసినట్టు చెప్పారు.

ఇక రత్నగిరిపై కూల్ కూల్



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో వేసిన కూల్ పెయింటింగ్

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులు వేసవి తాపంతో అల్లాడుతున్నారు. దీంతో భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాళ్లు కాలకుండా వైట్ పెయింటింగ్ (కూల్ పెయింట్) వేశారు. రామాలయం వద్ద గల ఆలయ ప్రాంగణంలో కూడా పూల్ పెయింట్ వేశారు. త్వరలోనే షామియానాలు, చలువ పందిర్లు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.